# ప్రజానావ

ప్రతి అక్షరం జనం కోసం..




# ఏపీహెచ్ఎంఈఎల్ అంచెలంచెలుగా ఎదగాలి

## డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

**ప్రజానావ, మందమర్రి:** ఆంధ్ర రాష్ట్రంలో గల విజయ వాడ సమీపంలోని ఇబ్రహీంపట్నంలో ఆంధ్ర ప్రదేశ్ హెవీ మిషనరీ ఇంజనీరింగ్ లిమిటెడ్ (ఏపీహెచ్ఎంఈఎల్) సింగరేణి అనుబంధ సంస్థ అంచెలంచెలుగా ఎదగాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు పేర్కొన్నారు. ఆ సంస్థను సింగరేణి సీఎండీ బలరాంతో కలిసి గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా కార్మికులతో తదుపరి మీడియాతో మాట్లాడారు. ప్రపంచ వ్యాప్తంగా కొత్త పరిశ్రమల విడిభాగాల తయారీ, పాత విడిభాగాల మరమ్మతు చేసి సరఫరా చేస్తున్న ఇంజనీరింగ్ సంస్థలకు ఏపీహెచ్ఎంఈఎల్ కన్నా మించి మిషనరీ, మానవ వనరులు లేవని అన్నారు. సంస్థలో పనిచేసే అధికారులు, కార్మికులకు కావాల్సింది ఒక నిబద్ధత, ప్రపంచంతో పోటీ పడగలం అన్న ఆలోచన, ఉన్న వ్యవస్థను సక్రమంగా వాడుకోవడం ఎలా అన్న తపన ఉంటే చాలనిన్నారు. మనం ప్రపంచంతో పోటీ పడగలమని డిప్యూటీ సీఎం భరోసా కల్పించారు. ఈ సంస్థను ఉన్నతంగా తీర్చిదిద్దేందుకు త్వరలోనే ఒక కన్సల్టెన్సీ ని నియమిస్తామని, వారు స్థానిక పరిస్థితులను అధ్యయనం చేసి నివేదిక ఇస్తారని తెలిపారు. ఆ నివేదిక ఆధారంగా ఏ తరహాలో ముందుకెళ్లాలో ఆలోచన చేసి నిర్ణయం తీసుకుంటామన్నారు. అధికారులు, సిబ్బంది ఎంత బాగా పనిచేస్తే అంత బాగా లాభాలు సాధిస్తామని, స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు ఉంటాయని, రాష్ట్రాల ప్రగతికి దోహదపడుతుందన్నారు. సంస్థను, ఉన్న మిషనరీని పరిశుభ్రంగా ఉంచాలని, యంత్రాలకు ఓవరాలింగ్ చేయాలని, రంగులు వేయాలని ఆదేశించారు. పనిచేసే సిబ్బంది తప్పకుండా భద్రతా చర్యలు పాటించాలని సూచించారు. కార్మికుల శ్రమ, ఉన్నత ఆలోచనలతోనే



ఈ పరిశ్రమ ముందుకు పోతుందని తెలిపారు. ఈ పరిశ్రమ సింగరేణి కాలరీస్ కు అవసరమైన కొత్త యంత్రాలు తయారు చేయడం, పాత యంత్రాల మరమ్మత్తు వరకే పరిమితం కాకుండా రాష్ట్రంలోనే కాదు, దేశానికి అవసరమైన ఆర్డర్స్ తీసుకొని బేల్ మాదిరిగా పనిచేస్తుందని తెలిపారు. థర్మల్ పవర్ స్టేషన్స్ కు అవసరమైన యంత్రాలు, యంత్రాల మరమ్మత్తు చేస్తుందని, ఈ సంస్థను భవిష్యత్తులో ఏ విధంగా అభివృద్ధి చేయాలనే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగరేణి చైర్మన్ ఎండి శ్రీ బలరామ్, అధికారులు పాల్గొన్నారు.





## కల్వర్టు మరమ్మతుకు వినతి

**ప్రజానావ, తాండూర్:** తాండూర్ మండలం నర్సాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి కల్వర్ట్ లోని పైపులు కొట్టుపోయాయని, వాటిని బాగు చేయించడంతో పాటు రోడ్డుకు మరమ్మత్తులు చేయించాలని కోరుతూ గురువారం బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ విజయ భాస్కర్ రెడ్డికి తుడుందెబ్బ తాండూర్ మండల అధ్యక్షులు కురిసింగ బాపూరావు ఆధ్వర్యంలో పలువురు గ్రామస్తులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి ఏరియా జీఎం సానుకూలంగా స్పందించి త్వరగా పరిష్కరిస్తారని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ గ్రామస్తులు సోయం పర్బత్ రావు, దిన్ధర్సవ్, శ్యామ్ రావు, బాదిరావు, జంగు, బొజ్జిరావ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## మా భూములు మాకే చెందేలా చూడండి



**ప్రజానావ, తాండూర్:** తమ భూములు తమకే చెందేలా మండల అధికారులు చూడాలని బోయపల్లి గ్రామానికి చెందిన కొలవార్ ఆదివాసీలు కోరారు. గురువారం తాండూర్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మంచిర్యాల జిల్లా తాండూర్ మండలం బోయపల్లి గ్రామంలో తాము 60 సంవత్సరాలుగా నివాసం ఉంటున్నామన్నారు. ఎస్టీ కులానికి చెందిన మన్నెవార్ (కొలవార్) ఆదివాసీలమని తెలిపారు. 2005లో 21 మందికి అప్పటి ప్రభుత్వం నిరుపేదలమైన మాకు భూములు పంపిణీ చేసి పట్టాలు ఇచ్చిందన్నారు. మేము 18 సంవత్సరాలు సాగు చేశామని, భూమిని రౌతు వెంకటేశం, నలిమెల రాజలింగు అనే వ్యక్తులు వచ్చి ఈ భూమి మాది, ఇక్కడి నుంచి వెళ్లిపోండి.. మళ్ల ఈ భూమిలో అడుగుపెడితే మిమ్మల్ని చంపుతామని దుర్భాషలాడడంతో పాటు మమ్మల్ని కొట్టడానికి చాలా మందిని తీసుకొని వెళ్లగొట్టారని అన్నారు. తాము తాండూర్ తహశీల్దార్, తాండూర్ ఎస్సై వద్దకు వెళ్లి తమ సమస్యను విన్నవించినామన్నారు. ఎస్సై తమ భూమి వద్దకు వచ్చి నెలిమెల రాజలింగుని పిలిపించి విల్లా భూమిలో రావద్దని చెప్పారన్నారు. తహశీల్దార్ బదిలీపై వెళ్లిపోగానే నలిమెల రాజలింగు వచ్చి మళ్ళీ మమ్మల్ని వెళ్లగొట్టి సంవత్సరం దున్నినాడు. ఇప్పుడు 10 రోజుల క్రితం మిట్ట వేణు అనే అతడు బోయపల్లి మాజీ సర్పంచ్ రాజకీయ బలంతో బొర మదునయ్య, ఇడిగిరాల బాలయ్యల భూమిని, మాది భూమి అంటూ మా భూములు దున్ని పంట వేశాడని తెలిపారు. ఈ భూమి మాదని చెప్పగా, నాకు మా నాన్న పేరు మీద పట్టా ఉందంటూ చెబుతున్నాడని, ఈ భూమిలోకి రావద్దంటూ వెళ్లగొట్టడం జరిగిందన్నారు. మాకు న్యాయం చేయగలరని వారు కోరారు. అనంతరం వారు తాండూర్ తహశీల్దార్ యూ జ్యోత్స్న, తాండూర్ ఎంపీడీవో శ్రీనివాస్ లకు వినతి పత్రం అందజేశారు. ఈ సమావేశంలో కోలవార్ మండల ప్రధాన కార్యదర్శి ఎలిగేటి రమేష్, దాసరి విజయ, మేకల మంతమ్మ, ఎడ్ల రాంబాయి, రెబ్బెన సత్తమ్మ ,ఎలిగేటి సుజాత, ఎడ్ల రాజేశ్వరి, తుంగడ మల్లమ్మ, ఎలిగేటి చంద్రమ్మ, దడ్డిచిన్నక్క, మానేపల్లి లక్ష్మి, బారే మారక్క, రెబ్బెన సరిత తదితరులు పాల్గొన్నారు.

## స్వాతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహించాలి



**ప్రజానావ, ఆసిఫాబాద్:** సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో 79వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జరుగుతున్న వేడుకల ఏర్పాట్లను జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో జరగనున్న స్వాతంత్ర దినోత్సవ వేడుకలను అధికారులు సమన్వయంతో కృషిచేసి విజయవంతం చేయాలని సూచించారు. వేదిక, సౌండ్ సిస్టం, ప్రముఖుల గ్యాలరీ, అధికారులు, ప్రజలు కూర్చునేందుకు కుర్చీలు, షామియానా, కార్యక్రమానికి వచ్చే వారికి స్నాక్స్, తాగునీరు, ప్రభుత్వ ప్రతినిధికి స్వాగతం, పోలీస్ గౌరవ వందనం, స్టాళ్ల ఏర్పాటు వంటి ఏర్పాట్లు పూర్తి చేయాలని ఆదేశించారు. విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలు, నిరంతర విద్యుత్ సరఫరా, ఇతర ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తి ఏర్పాట్లతో వేడుకలను విజ యవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీ ణ అభివృద్ధి అధికారి దత్తారావు, కలెక్టరేట్ పరిపాలన అధికారి కిరణ్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



'ఓట్ల దొంగలు గద్దె దిగండి' కార్యక్రమంలో భాగంగా ఇందిరాగాంధీ విగ్రహం నెక్లెస్ రోడ్ చౌరస్తా ( ఖైరతాబాద్) వద్ద గురువారం ఏఐసీసీ పిలుపుమేరకు కాంగ్రెస్ నేతలు కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, కంటెస్టెడ్ ఎమ్మెల్యే ఫిరోజ్ ఖాన్, డీసీసీ అధ్యక్షుడు రోహిన్ రెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ పీ. విజయ రెడ్డితో పాటు పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, మహిళలు, పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

- ప్రజానావ, ఖైరతాబాద్



## వరద కాలువలను పరిశీలించిన హైడ్రా కమిషనర్

**ప్రజానావ, హైదరాబాద్:** వర్షాల సమయంలో నీట మునిగే అవకాశం ఉన్న ప్రాంతాలను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ గురువారం పరిశీలించారు. ఎక్కడా ఆటంకాలు లేకుండా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బంజారాహిల్స్‌లోని అంబేద్కర్ బస్తీలో ఇటీవల కూలిపోయిన నాలా రిటైనింగ్ వాల్ పరిసరాలను పరిశీలించారు. ఈ గోడ పడిపోవడంతో వరద తమ ప్రాంతాలను ముంచెత్తుతోందని స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు కమిషనర్ పర్యటించారు. ఇప్పటికే రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు ప్రారంభమవ్వగా.. త్వరితగతిన పూర్తిచేయాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం పాతబస్తీలోని తలాబ్‌చంచలం డివిజన్‌లో పర్యటించారు. అక్కడ గుర్రం చెరువు నుంచి మూసీని కలిపే వరద కాలువను పరిశీలించారు. ఈ కాలువలో కొన్నేళ్లుగా పూడికను తీయకపోవడంతో పరిసర వందలాది కాలనీలకు వరదముప్పు వచ్చేదని.. ఇటీవల హైడ్రా పనులు చేపట్టడంతో ఈ ఏడాది ఇబ్బంది ఏర్పడలేదని స్థానికులు కమిషనర్‌కు వివరించారు. 15 రోజులుగా జరుగుతున్న సిల్ట్ తొలగింపు పనులను హైడ్రా కమిషనర్ పరిశీలించారు. మిషినరీని పెంచి వెంటనే ఈ పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



## రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టాలి

**ప్రజానావ, ఆసిఫాబాద్ రూరల్:** భారీ వర్షాల నేపథ్యంలో ప్రజల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. గురువారం మాలన్ గొంది గ్రామానికి వెళ్లే రహదారి వంతెన వద్ద అప్రోచ్ రోడ్డు కొంతమేర తెగిపోవడంతో అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దెబ్బతిన్న రహదారికి వెంటనే మ-రమ్మత్తు పనులు చేపట్టి ప్రజల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాబోయే మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ప్రజలు అత్యవసరమైతే తప్పా బయటకు రావద్దని సూచించారు. రైతులు, కూలీలు, పశువుల కాపరులు భారీ వర్షాలు కురిసినప్పుడు చేను పనులకు, పశువులను మేపేందుకు వెళ్లకూడదని తెలిపారు. వంతెనలు, వాగులు, కాజ్ వేల వద్ద బందోబస్తు ఏర్పాటు చేసి ప్రజలు అటువైపు వెళ్ళకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో వరద ప్రభావిత, లోతట్టు ప్రాంతాల్లో ప్రజల రక్షణ కోసం అవసరమైన చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఈఈ అజ్మీర కృష్ణ, తహశీల్దార్ రియాజ్ అలీ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



